# దివ్యవనాలు - విశిష్టత

40వ భాగం

జె. వేణిమాధవి
నేచురలిస్ట్
www.vedicvanas.com





*సరస్వతీ మతిమాకు చాలంగ నిమ్ము పరమేష్ఠిరాణి మము పాలించవమ్మా పల్లకీ మృదుపాణి వరనీలవేణి, పల్లవారుణ పాణి పరమ కల్యాణి జలజ సంభవు రాణి సైకిత శ్రోణి అలివేణి శుకపాణి అష్టావధాని కరుణ కదంబ చక్కని శారదాంబ !*

## యాజ్ఞవల్క్యుడు - సరస్వతీ అనుగ్రహం

ఒకానొక సందర్భంలో యాజ్ఞవల్క్యమహర్షి తన గురువైన వైశంపాయనుడి ఆగ్రహానికి గురయ్యాడు. దాని ఫలితంగా అతను చదువుకున్నదంతా కోల్పోయాడు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు శోకార్తుడై సూర్యభగవానుని అనుగ్రహం కొరకు తపస్సు చేయగా, ఆ తపస్సుకి మెచ్చిన సూర్యుడు అతడికి వేదవేదాంగాలు అనుగ్రహించాడు. అయితే యాజ్ఞవల్క్యునికి జ్ఞాపకశక్తి లోపించడాన్ని గమనించి సరస్వతీ స్తోత్రాన్ని భక్తితో నిరంతరం పఠించమని సూచించాడు. యాజ్ఞవల్క్యుడు సూర్యుడు చెప్పినవిధంగా భక్తితో సరస్వతీ స్తుతిని విడవకుండా పఠించాడు. ఆ స్తుతిలో తాను గురుశాపం వల్ల విద్యాహీనుడుగా అయినట్లు, జ్ఞాపకశక్తి కోల్పోయినట్లు చెప్పాడు.





తన మీద దయచూపి జ్ఞాన, జ్ఞాపిక శక్తులను ప్రసాదించమని, విద్యను చక్కగా శిష్యులకు బోధించే శక్తిని, గ్రంథ రచనా శక్తిని, ప్రతిభగల శిష్యులను తనకు ప్రసాదించమన్నాడు. అంతేకాక తనకు సత్సభలలో మంచి విచారణ శక్తిని కూడా అనుగ్రహించమని ఆ సత్యస్వరూపిణి, వ్యాఖ్యానరూపిణి అయిన సరస్వతిని పదే పదే స్తుతించటంతో ఆ మాత అతడిని అనుగ్రహించి మళ్ళీ సంపూర్ణ జ్ఞానవంతునిగా, సుకవిగా వెలుగొందమని ఆశీర్వదించింది. *(దేవీ భాగవతం)*

అటువంటి చదువుల తల్లికి అత్యంత ప్రీతపాత్రమైన పుష్పాల గురించి తెలుసుకొని ఆమెని పూజించి, స్తుతించి, ఆరాధించి ఆమె దివ్యానుగ్రహాన్ని పొందుదాం.

గతంలో మనం పొగడ చెట్టు వైద్యగుణాలు గురించి, పూరీ పట్టణంలో వున్న సిద్ధవకుళ ప్రాశస్త్యాన్ని తెలుసుకున్నాం కదా. ఆ క్రమంలోనే భారతావనిలో గల మరిన్ని విశేషమైన పొగడ వృక్షాల గురించి తెలుసుకుందాం. మన పూర్వీకులు ఈ వృక్షం దివ్యత్వాన్ని గుర్తించి, ఆదరించి వాటిని విరివిగా నాటినట్లు మనదేశంలోని వివిధ చారిత్రక ప్రదేశాలను, పురాతన ఆలయాలను గమనిస్తే విశదమవుతుంది.

**శ్రీ మదన గోపాల మందిరం :** 14వ శతాబ్ద కాలంలో ఒడిషా రాష్ట్రంలోని నవద్వీప సమీప ప్రదేశంలో శ్రీసారంగ ఠాకూర్ అనే భక్తుడు వుండేవాడు. ఆయన శ్రీ మదన గోపాలస్వామిని సేవించుకుంటూ ఆ మందిరం వద్దే నివాసముండేవాడు. ఒకరోజు శ్రీ చైతన్య మహాప్రభువు అక్కడికి విచ్చేసిన సందర్భంలో ఆ ప్రాంగణంలో బలహీనంగా వుండి చనిపోవడానికి సిద్ధంగా ఉన్న పొగడచెట్టును చూసాడు. దాని గురించి సారంగుడిని అడుగగా అతను అది ఆయన దయపై ఆధారపడి వుందని సెలవిస్తాడు. అప్పుడు పరమ దయాళువైన శ్రీ చైతన్య ప్రభువు ఈ చెట్టును ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాడు. అది మహావృక్షమై ఈరోజుకీ భక్తులచే పూజలందుకొంటూ, వారికి తన దీవెనలిస్తోంది.





**గీతామందిరం - వార్ధా :** మహారాష్ట్రలోని వార్ధా నగరంలో వున్న గీతామందిరంలో వినోబాభావే, ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ (సరిహద్దు గాంధీ) కలిసి 1964 లో నాటిన ఒక పొగడ చెట్టు ఈ రోజు పెద్ద

వృక్షమై అలరారుతోంది. ఈ గీతామందిరం ప్రత్యేకత ఏమిటంటే ఇక్కడ భగవద్గీతలోని 18 అధ్యాయాల్లోని ఒక్కో శ్లోకం ఒక్కో గ్రానైటు ఫలకంపైన చెక్కి ప్రతిష్ఠించడం జరిగింది. 36 ఎకరాల స్థలంలో ఒక గోవు ఆకారంలో వీటిని ప్రతిష్ఠించారు. ఇక్కడ ఎటువంటి గుడిగానీ, విగ్రహాలు గానీ వుండవు. ఇక్కడ ప్రతి ఏటా గీతాజయంతిని విశేషంగా జరుపుకుంటారు. ఆరోజు వేలాదిమంది విద్యార్థులు కలసి గీతాపఠనం చేస్తారు.

రెండేళ్ళకొకసారి గీతాపఠనంలో పోటీలను నిర్వహించి సర్టిఫికెట్లు, అవార్డులు, బహుమానాలను ఇచ్చి శ్రీ భగవద్గీతాపఠనాన్ని ప్రోత్సహించి దాని విశిష్ఠతను అందరికీ తెలియజేస్తుంటారు. ఇక్కడ కేవలం భగవద్గీతకు మాత్రమే ప్రాముఖ్యతనిచ్చి పెద్ద పీట వేయడం జరిగింది. అటువంటి పవిత్రస్థలంలో ఈ పొగడ వృక్షం పరిమళాలను వెదజల్లుతూ తన చైతన్యం దివ్యత్వాలతో ఆ ప్రదేశానికి మరింత విశిష్టతను చేకూరుస్తోంది.











**పొగడచెట్టు క్రింద జ్ఞానోదయం :** మధ్యప్రదేశ్ రాష్ట్రం, జబల్పూర్‌లోని బన్వర్తల్ తోటలో గల ఈ పొగడ చెట్టు విశేషం ఏమిటంటే చంద్రమోహన్ జైన్ అనే వ్యక్తి 1953 మార్చి 21 న ఈ చెట్టు నీడలోనే అతి పిన్నవయస్సులోనే జ్ఞానోదయం పొందారు. ఈయనే కాలక్రమంలో 'ఓషో రజనీష్' గా ప్రఖ్యాతి గాంచారు. ఆ ప్రాంతంవారు పొగడచెట్టును 'మౌల్ శ్రీ' అని పిలుస్తారు.









**దైవ కార్యాల్లో సుగంధ పుష్పాల పాత్ర**

* పూజ, జప, తప ధ్యానాదులు, యజ్ఞయాగాది దైవ కార్యాలలో సువాసన ఒక ముఖ్య భూమికను నిర్వర్తిస్తుంది. మానసిక ప్రశాంతత, సత్సంకల్పాలను కలిగిస్తుంది.

* సాధనా మార్గంలో వున్న ఒక ముముక్షువు అంతర్ముఖుడైనప్పుడు ఇంద్రియాలన్నింటిలోకి కేవలం నాసిక మాత్రమే శ్వాసిస్తూ వుంటుంది. అట్టి పరిస్థితిలో ముముక్షువుకు నిర్మల ఏకాగ్రచిత్తం కలిగి ఊర్ధ్వలోకాలతో తాదాత్మ్యం చెందేందుకు చేసే జపం, తపం, మంత్రం మున్నగు వాటితో పాటు పరిమళం కూడా సహకరిస్తుంది.

* మానవుని చైతన్యాన్ని ఈ అనంత విశ్వంలోని అత్యున్నత స్థాయిలు లోకాలతో అనుసంధానించగల సామర్థ్యం ఈ పరిమళాలకు వుంది. పలు సందర్భాల్లో వివధ స్థాయిల్లో మనం కూడా పలు అనుభూతులను చెందుతూంటాము.

వివిధ పురాణాలు, సంకీర్తనల నుంచి భక్తిగీతాలు, గ్రామీణ పాటల వరకు పొగడ పువ్వుల ప్రస్తావనను మనం తరచూ గమనించవచ్చు. వివిధ సందర్భాల్లో ఈ పువ్వులనే వకుళ, బకుళ, కేసర, పొగడ, బొగడ మొదలైన పేర్లతో సంబోధిస్తుంటారు.

**శ్రీ రామాయణం - అశోకవన వర్ణన**

అశోకవనికా చేయం దృఢం రమా దురాత్మనాః
చందనైశ్చంపకైశ్చాపి వకులైశ్చ విభుషితాః॥
*(శ్రీమద్రామాయణం 5-14-43)*

**శ్రీ శివమహాపురాణం**

ఇవి తీవ్ర క్షామానంతరం శ్రీ గౌతమముని, అహల్యలు పెంచిన మొక్కల వర్ణన.

అవిరలఘన సుగంధ్యాద్యఅరంద నిష్యంద సుందర కుసుమ
కుంద కుటజ మందార మాధవీ మాలతీ వకుళ చంపక
కరవీర కేతకీ కులతతుల పరిపక్వ ఫలరాజి...

(శివమహాపురాణం, త్ర్యయంబకేశ్వరం)

### శ్రీ సూర్యభగవానుని ప్రాతః స్తుతి

శ్రీ సూర్యనారాయణా మేలుకో హరి సూర్య నారాయణ
పొడుస్తూ భానుడు పొన్న పువ్వూ ఛాయ
పొన్నపువ్వూ మీద పొగడ పువ్వూ ఛాయ
శ్రీ సూర్యనారాయణా మేలుకో హరి సూర్య నారాయణ

### బతుకమ్మ పాటలు

శ్రీ లక్ష్మీ నీ మహిమలు గౌరమ్మ
చిత్రమై తోచునమ్మ గౌరమ్మ॥
కట్లె పుష్పంబులు - కాకర పువ్వులు
తంగేడు పువ్వులు - గన్నేరు పువ్వులు
పోట్ల పువ్వులు జల్లుచూ గౌరమ్మ
పొగడ పువ్వులు నింపుచూ గౌరమ్మ ॥శ్రీలక్ష్మీ॥

### శ్రీకృష్ణుని వేణుగానం

జయదేవుని అష్టపదుల్లో యమునా తీరంలోని తోటలు, అరణ్యాలలో శ్రీకృష్ణ పరమాత్ముడు పొగడ చెట్లక్రింద వేణుగానం చేస్తున్న వర్ణనలు పలు సందర్భాల్లో చూడవచ్చు.





ఇవేకాక ఏ పురాణ ఇతిహాసాలను పరికించి చూసినా, భారత, భాగవత గాథలను చూసినా ఈ దివ్యవృక్షం ప్రస్తావన మనకు అడుగడుగునా కనిపిస్తుంది. అప్పటి అరణ్యాలు, తోటలు, ఉద్యానవనాలు, పలురకాల ఫల, పుష్ప వృక్షాలతో శోభాయమానంగా అలరారుతూండేవి.

### నక్షత్ర వనం

పొగడచెట్టు అనూరాధ నక్షత్ర జాతకులకు సూచించబడింది. ఈ వృక్షం వారికి మరింత విశేషమైన ఫలితాలను ఇస్తుంది. విష్ణువు, శివుడు, శ్రీకృష్ణుడు, శ్రీ వేంకటేశ్వరస్వామి, సరస్వతీదేవి, ఆంజనేయుడు మొదలైన దేవతలకు ఈ పువ్వులను విశేషంగా సమర్పిస్తూంటారు. అంటే ఇంచుమించు దేవతలందరికీ ఈ పువ్వులంటే ఎంతో మక్కువ.

### హిందుత్వం యొక్క ఔన్నత్యం

తోటలను, ఉద్యానవనాలను ఎంతో ఆసక్తిగా పెంచే మొఘలులు కూడా పొగడచెట్లను విరివిగా పెంచారు. అయితే వారు ఈ దివ్య వృక్షాలను వారి సమాధులు, విహారతోటల్లో విరివిగా పెంచగా, హిందువులు మాత్రం పొగడ చెట్టు దివ్యత్వాన్ని గుర్తించి వాటిని పవిత్రమైన పుణ్యక్షేత్రాలు, దేవాలయాలు, తోటల్లో పెంచి, వాటి కుసుమాలను దైవకార్యాల్లో వినియోగించడం అనాదిగా వస్తోంది. మొఘలులు ఎక్కువశాతం చెట్లను కేవలం అందం కోసం మాత్రమే పెంచి, వివిధ ఆకృతుల్లో మలచడం, కనీసం పువ్వులు కూడా పుయ్య నివ్వని పరిస్థితుల్లో ఆ చెట్లను పెంచడం దురదృష్టకరం, శోచనీయం.









మొఘలులు ప్రకృతి పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కంటే కూడా కళ్లకు ఇంపుగా వుండి, మనిషిని మెప్పించేందుకే ఎక్కువ ప్రాముఖ్యతను ఇవ్వడం మనం గమనించవచ్చు.

వీటిని బట్టి హిందు సంస్కృతి యొక్క ఔన్నత్యం, ప్రకృతి పట్ల మనకున్న ఆరాధనాభావాలు, ఉన్నత ఆలోచనా విధానాలు మన కళ్లె దుటే స్పష్టంగా కనిపిస్తున్నాయి. మన పూర్వీకులు ఈ పూల పరిమళా లను ప్రజల భౌతిక, మానసిక ఆరోగ్యం, తద్వారా సమాజ శ్రేయస్సు నుంచి మానవుని అత్యున్నతమైన ఆధ్యాత్మికోన్నతికి అను సంధానించిన వైనం ఇతర దేశస్తులు కూడా ఆదర్శంగా తీసుకోదగ్గ విషయం.

### పరిమళ ప్రాధాన్యత

* సాధారణంగా సువాసనలు మన శారీరక మానసిక శ్రమ, ఒత్తిడి, ఆందోళనల నుంచి ఊరట కలిగించి స్వాంతన చేకూర్చే గుణాన్ని కలిగివుంటాయి.
* ఇవి వ్యాధికారక సూక్ష్మక్రిములను సంహరించే గుణాన్ని కలిగివుండటం వల్ల వాటి చుట్టుపక్కల గాలిని శుభ్రపరుస్తాయి.
* అదేవిధంగా మనలోని మలినాల్ని, కొన్నిరకాల వ్యాధులను కూడా తేలికగా తొలగిస్తాయి.
* వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి.
* కొన్నిరకాల సుగంధాలు మన కండరాలను విశ్రమింపచేసే చక్కటి నిద్ర పట్టేలా చేస్తే మరికొన్ని పరిమళాలు మన మెదడులోని నిద్రాణ కేంద్రాలను మేల్కొలిపి ఉత్తేజపరచి తద్వారా మెదడు యొక్క చురుకుదనం, ఏకాగ్రతలను పెంపొందిస్తాయి.
* ఇంకొన్ని రకాలు కామప్రేరిత తత్వం కలిగి సత్సంతానాభివృద్ధికి తోడ్పడతాయి.

### ఘ్రాహణాశక్తి లోపం

సాధారణంగా మనం చూపు మందగించినా లేక వినికిడి లోపించినా వెంటనే వైద్యుని సంప్రదిస్తాం కానీ రుచి తెలియకపోయినా లేక వాసనలను సరిగా గుర్తించలేకున్నా దాన్ని అసలు ఒక లోపంగానే గుర్తించం. వాసనలను గుర్తించలేకపోవడానికి కూడా అనేక కారణాలు, ప్రత్యామ్నాయాలున్నాయి. దీర్ఘకాలం ఈ లోపం వుండటం వల్ల శ్రమ, ఒత్తిడుల నుంచి ఉపశమనం కలుగక, మానసికంగా కృంగిపోయే అవకాశాలున్నాయి. ఇది అశ్రద్ధ చేయకూడని విషయం. మన పంచేంద్రియాలు చక్కగా పనిచేసినప్పుడే అవి మనల్ని ఒక సమతుల్య స్థితిలో వుంచగలుగుతాయి.

### తాజా పరిమళాలే మేలు

పువ్వుల పరిమళాలను ఎప్పుడైనా, ఎంతైనా ఆస్వాదించవచ్చు. అయితే అతి ముఖ్యంగా గమనించవలసిన విషయమేమంటే పైన ప్రస్తావించిన విషయాలు చెట్టు మీద సహజసిద్ధంగా వికసించిన పువ్వుల పరిమళాలను ఉద్దేశించినవి. ఇప్పటిరోజుల్లో మనకి సులువుగా లభ్యమయ్యే పరిమళాల్లో కృత్రిమ రసాయనాలు కలిగివుండటం చేత అవి తాజాపువ్వులు ఇచ్చేటంతటి ఫలితాలను ఇవ్వకపోవచ్చు. కాబట్టి వీలైనంత వరకూ ఈ దివ్యవృక్షాలను విరివిగా పెంచి, వాటి సహజ సువాసనలతో మన పరిసర వాతావరణంలోని కాలుష్యాలను తగ్గించుకోవడం అత్యుత్తమమైన పద్ధతి. ఈ ఆధునిక కాలంలో జరుగుతున్న విషయానికి వస్తే ఈక్రింది విధంగా వుంది.

### వకుళ - విద్యార్థులకు వరాల తల్లి

1990 దశకంలో అమెరికా వాస్తవ్యులైన క్రిస్టోఫర్ దంపతులు పువ్వుల నుంచి సుగంధ ద్రవ్యాల సేకరణమీద అధ్యయనం చేస్తూ మనదేశం అంతటా విస్తృతంగా పర్యటించారు. వారు కాన్పూర్-ఐటిఐ ప్రాంగణంలో విరివిగా నాటిన పొగడచెట్లను గమనించి ఆరా తీయగా, వాటిని మన దేశీయులు వినియోగించిన పద్ధతి, ఉద్దేశాలను గురించి తెలుసుకొని ఆశ్చర్యపోయారు. పొగడపువ్వుల సువాసన విద్యార్థుల జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుంది అన్న విషయాన్ని కాన్పూర్ కాలేజి వ్యవస్థాపకులు గుర్తించి, అక్కడి విద్యార్థులు వారి కృషి, పట్టుదల, ప్రతిభలతో పాటు అక్కడి వాతావరణం ఇంకా పరిసర ప్రకృతి కూడా వారికి మింత సహకరించాలన్న ఉద్దేశ్యంతో వారి కళాశాలలో పొగడ చెట్లను విరివిగా నాటించారు.

వారు ఒక పద్ధతి ప్రకారం ప్రతి తరగతి గది బయట ఒక చెట్టు ఉండేలా జాగ్రత్తపడ్డారు. రహదారికిరువైపులా, ఇతర ముఖ్యప్రదేశాలలో కూడా ఈ చెట్లను ప్రత్యేక శ్రద్ధతో పెంచారు. భారతదేశపు సుగంధ ద్రవ్యోత్పత్తుల కేంద్రమైన ఉత్తరప్రదేశ్‌లోని 'కన్నౌజ్' నగర కాన్పూర్‌కి పక్కనే వుండటం గమనించదగ్గ విషయం. ఉత్తరాది ప్రాంతంవారు పొగడచెట్టుని 'మౌల్‌శ్రీ' గా సంబోధిస్తారు.







ఈ ఒక్క ఉదాహరణ చాలు, మనం పొగడచెట్టుకి, సరస్వతి దేవికి, విద్యార్థులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని తెలుసుకోవడానికి. మనదేశంలో అత్యున్నతమైన స్థాయిలో విద్యను అందించే విశ్వవిద్యా

లయాల్లో ఐఐటి కాలేజీలు ముందున్నాయి. మరి ఐఐటి కళాశాలల వారు ఆచరించి చూపించిన ఈ కార్యాన్ని దేశంలోని అన్ని ప్రాంతాల వారు ఆదర్శంగా తీసుకొని వారి వారి ప్రాంతాల్లోని ప్రతి పాఠశాల, కళాశాల, విద్యాలయాల్లో ఈ వృక్షాలను విరివిగా పెంచాలి. పొగడ పువ్వులకు కొన్నిరకాల మానసిక రుగ్మతల్ని నయం చేసే గుణంతో పాటు జ్ఞాపకశక్తిని పెంపొందించగల సామర్థ్యం కూడా వుంది.









**సుందర సుగంధ నగరాలు సాధ్యమే...**

మన పొరుగు రాష్ట్రంలోని 'గార్డెన్‌సిటీ' గా పేరుగాంచిన బెంగుళూరు మహానగరం మనకు ఆదర్శప్రాయం. నగరం నడిబొడ్డు ప్రాంతాల్లో కూడా సంవత్సరంలోని పలు సమయాల్లో వ్యాపించే పువ్వుల పరిమళాలను



ఆఘ్రాణించడం అక్కడివారికి సర్వసాధారణ విషయం. వారు కేవలం నీడను ఇచ్చే వృక్షాలనే కాకుండా రంగురంగుల పూలచెట్లు, సువాసనాభరిత పుష్ప రకాలను నాటడం విశేషం. వీటిని వారు పలు దశాబ్దాలక్రితం నాటడం జరిగింది. శబ్ద వాయు కాలుష్యాలు అధికంగా వున్న నగరాలను కూడా అత్యంత సుందరంగా, సుగంధ భరితంగా ఎలా తీర్చిదిద్దవచ్చో మనం ప్రత్యక్షంగా ఇక్కడ చూడవచ్చు.

మనం ప్రతియేటా వనమహోత్సవాలప్పుడు వందలు, వేల మొక్కలు నాటడమన్నది ఎంత ముఖ్యమో, ఏ మొక్కలు నాటామన్నది కూడా అంతే ప్రాముఖ్యత కలిగివుంది. మన పరిసరాలను తీర్చిదిద్దుకోగలడం మన మనస్సు, ఆలోచనల్లోనే వుంది. పొగడచెట్లు అటవీశాఖకు చెందిన నర్సరీల్లో సులువుగా లభ్యమవుతాయి. మరి ఆ చల్లని తల్లులైన వకుళమాత, సరస్వతీదేవిలను మన లోగిళ్లలోకి ఆహ్వానించడానికి ఆలస్యమెందుకు!

*హంసాసనాయై నమః ।*

*వకుళపుష్పం (పొగడపువ్వు) సమర్పయామి॥*